ఆంధ్రప్రభ 3.8.2000

# ఢిల్లీ రంగస్థలంపైకి 'ప్రజానాయకుడు ప్రకాశం'



'ప్రజానాయకుడు ప్రకాశం' నాటకంలో ఒక దృశ్యం. ఇందులో ప్రకాశం పాత్రలో చాట్ల శ్రీరాములు, టంగుటూరి సూర్యకుమారి పాత్రలో సురభి శ్యామల నటిస్తున్నారు

(ఆంధ్రప్రభ విలేఖరి)

హైదరాబాద్, ఆగస్టు 2: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'రసరంజని' రూపొందించిన 'ప్రజానాయకుడు —ప్రకాశం' సందేశాత్మక నాటకాన్ని ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాలతోపాటు ఢిల్లీలో సైతం విస్తృతంగా ప్రదర్శించనున్నారు. 'రసరంజని' సంస్థ అధ్యక్షుడు, రాష్ట్ర పోలీస్ డైరక్టర్ జనరల్ హెచ్. జె.దొర బుధవారం ఇక్కడ ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఈ విషయ్యం తెలియజేశారు. ప్రేక్షకులు టిక్కెట్ కొని నాటకం చూసే రోజులు తప్పక రావాలనే ప్రగాఢ ఆకాంక్షతో నాటకరంగ పురోభివృద్ధికి రసరంజని నిర్విరామ కృషి చేస్తోందని, ఈ కృషిలో భాగంగానే నిస్వార్థ రాజకీయ నాయకుడు, నిష్కళంక దేశభక్తుడు అయిన టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శజీవితాన్ని నేటితరానికి చాటిచెప్పాలనే ఉద్దేశంతో ఈ నాటకాన్ని రూపొందించామని చెప్పారు.ఈ నాటకాన్ని ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ల లోని వివిధ ప్రాంతాలతోపాటు జాతీయ స్థాయిలో ఢిల్లీలో కూడా నిర్వహించాలని నిశ్చయించామని దొర తెలిపారు.

ఆచార్య మొదలి నాగభూషణశర్మ రచన, దర్శకత్వంలో రూపు దిద్దుకుని సుమారు రెండున్నర గంటల పాటు ప్రదర్శించే ఈ నాటకం, ప్రకాశం 129వ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, విశాఖపట్నం పట్టణాలలో ప్రదర్శిస్తారు. అలాగే రాష్ట్ర సాంస్కృతిక శాఖ, దక్షిణ భారత సాంస్కృతిక కేంద్రం (ఎస్.ఐ.సి.ఎ)ల సంయుక్త ఆధ్వర్యంలో కొత్త ఢిల్లీలోని శ్రీరామ్ సెంటర్ థియేటర్‌లో ఆగస్టు 23వ తేదీన ప్రకాశం జయంతి వేడుకలను నిర్వహించడంతోపాటు ఈ నాటకాన్ని కూడా ప్రదర్శిస్తారు. నాటి కార్యక్రమానికి లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి ముఖ్యఅతిధిగా హాజరవుతారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఈ నాటకంలో ఆంధ్రకేసరి టంగుటూరి పాత్రను ప్రముఖ నాటక రంగ ప్రయోక్త చాట్ల శ్రీరాములు పోషిస్తున్నారు.

విలేఖరుల సమావేశంలో రసరంజని సంస్థ ఉపాధ్యక్షులు కె. వి. రమణ (ఐ.ఏ.ఎస్), సంయుక్త కార్యదర్శి గరిమెళ్ళ రామమూర్తి, కార్యవర్గసభ్యులు, నాటకం దర్శకుడు మొదలి నాగభూషణ శర్మ, ప్రకాశం పాత్రధారి చాట్ల శ్రీరాములుకూడా పాల్గొన్నారు.